క్లుప్తంగా

కృష్ణా కళాశాలలో ఘనంగా జల దినోత్సవం


కృష్ణా కళాశాలలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో అంతర్జాతీయ జల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో వనం–జలం పేరిట ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. కళాశాల హరిత ఏకో క్లబ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వనం–జలం–మన ఆరోగ్యం అనే నినాదంతో అందరూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హరిత ఏకో క్లబ్ కోఆర్డినేటర్ డి.ఎస్.మాధవరావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీవాణి, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అవసరం


అన్నదానం చేస్తున్న సత్యనారాయణ

బీచ్ రోడ్డు: రోజువారీ ఆదాయంలో కొంత మేర సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలన్న దృక్పథం ఉండడం చాలా అవసరమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణ అన్నారు. ఉగాది పండగ సందర్భంగా బుధవారం బీచ్‌రోడ్డులోని శ్రీసంపత్ వినాయక సమ్మెరియన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మనసుతో ఉగాది రోజున ఇలాంటి అన్నదాన కార్యక్రమం చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.కె.రెహమాన్, పలవరపు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం


పీఆర్వో నాయుడుకు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని పెద్దవాల్తేరుకు చెందిన పేరి రామ భాస్కరరావు అనేదాత లక్ష 1116 రూపాయిల విరాళం ఇచ్చారు. సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో సంబంధిత విరాళాన్ని చెక్కురూపంలో పీఆర్వో నాయుడుకు అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించారు.

కిటకిటలాడిన రైతుబజార్


సీతమ్మధార రైతుబజార్‌లో వినియోగదారుల రద్దీ

సీతమ్మధార: ఉగాది పండగ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి సీతమ్మధార రైతు బజార్ వినియోగదారులతో కిటకిటలాడింది. పువ్వులు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, అరటిపళ్లు, చెరుకుగడలు, వేపపువ్వు, మామిడి కాయలు ఇలా పూజ సామగ్రి కొనుగోలు చేశారు. రైతుబజార్ సహాయకుడు సతీష్ సీసీ కెమెరాల ద్వారా దొంగతనాలు జరగకుండా పర్యవేక్షించారు. బజారు మొత్తం వినియోగదారులతో నిండిపోవడంతో జేబు దొంగలు చేతి వాటం చూపారు. ఒక వ్యక్తి జేబులోంచి రూ.10 వేలు దొంగిలించారు. దీంతో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కార్యాలయంలో బాధితుడు ఫిర్యాదు చేశాడు.

యథేచ్ఛగా అదనపు అంతస్తులు

- 10వ వార్డు ఇందిరానగర్‌లో ఇరుకు రోడ్లలో అనధికారిక నిర్మాణాలు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు


అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఇరుకు రోడ్డులో నిర్మిస్తున్న నాలుగో ఫ్లోర్


ఆనంద్‌మార్గ్ ఆశ్రమం సమీపంలో ఇరుకు రోడ్లు పక్కన అధికారికంగా నిర్మిస్తున్న నాలుగో ఫ్లోర్


ఇందిరానగర్ ఆర్చి సమీపంలో రోడ్డు ఆక్రమించి చేపడుతున్న అపార్ట్‌మెంట్ నిర్మాణం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పరిధి డెయిరీ ఫారం సమీప ఇందిరానగర్‌లో అనధికారిక అదనపు అంతస్తులు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ఇరుకు రోడ్లు, సందుల్లో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తల దాచుకోవడం కోసం 50, 60 చదరపు గజాలలో చేపట్టే నిర్మాణాలను కూల్చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ కట్టడాల వైపు కన్నెత్తి కూడా చూడటంలేదనే విమర్శలు ఉన్నాయి.

ఆనంద్‌మార్గ్ సమీపంలో..

ఇక్కడి ఆనంద్‌మార్గ్ ఆశ్రమం నుంచి లోపలకు చిన్న రోడ్డు ఉంది. ఇది 6 అడుగుల వెడల్పు ఉంటుంది. దీనికి కనెక్టివ్ రోడ్డు 4 అడుగులు ఉంది. ఈ రోడ్డులో సుమారు 120 చదరపు గజాల స్థలంలో ఓ వ్యక్తి గ్రూప్ హౌస్ నిర్మాణం చేపట్టాడు. మూడు ఫ్లోర్లకు టౌన్ ప్లానింగ్ అధికారులకు సదరు వ్యక్తి ప్లాన్ పెట్టుకున్నాడు. ఈ భవనానికి సుమారు 150 మీటర్ల దూరంలో ఉన్న కాలనీ ప్రధాన రహదారి పక్కన నిర్మాణం చేపడుతున్నట్టు టౌన్ ప్లానింగ్ అధికారులకు ప్లాన్ కోసం దరఖాస్తు చేశాడు. దీన్ని పరిశీలించారో? లేదో? తెలియదు గానీ అధికారులు అనుమతి ఇచ్చేశారు. ఈ భవనం వద్దకు ఉన్న రహదారిలో ఆటో వెళితే దాని పక్కన కనీసం ఒక్క మనిషి నడవడానికి కూడా వీలు పడడం లేదు. ఇక్కడికి సమీపంలోనే ఉన్న సచివాలయం టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూడా పరిశీలించకపోవడం గమనార్హం. ఇరుకు రోడ్డులో నిర్మాణం చేపట్టడానికి ఇక్కడ ఏవిధంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి ఇచ్చారో అంటూ స్థానికులు మండి పడుతున్నారు.

ఆర్చ్ సమీపంలో..

ఇందిరానగర్ ఆర్చి దాటి రామాలయం వీధికి వెళ్లే రహదారిని ఆనుకొని ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపడుతున్నారు. నిజానికి ఇందిరానగర్ లోపల 30 అడుగుల వెడల్పు రోడ్డు ఉంది. ఈ భవనం నిర్మాణం ఈ రోడ్డు ప్రారంభంలోనే జరుగుతుంది. ఈ భవనం ముందు 15 నుంచి 18 అడుగులు మాత్రమే మిగిలింది. రోడ్డును ఆక్రమించి ఈ నిర్మాణం సాగుతోంది. అపార్ట్‌మెంట్ ప్రారంభంలో 15 అడుగులు, కాలనీ లోపల 25 నుంచి 30 అడుగులు వెడల్పు రోడ్డు ఉంది. ఈ భవనానికి సెట్‌బ్యాక్‌లు కూడా విడిచిపెట్టలేదు. నిర్మాణం చేపట్టినప్పుడే స్థానికులు అడ్డుకున్నారు. ఇది సచివాలయానికి అత్యంత సమీపంలోనే ఉండటం గమనార్హం. కానీ అధికారుల అండదండలతో సదరు వ్యక్తి నిర్మాణం చేపట్టుకుపోతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీని వల్ల తన కాలనీలో రోడ్డు స్నబడిపోతుందని అంటున్నారు.

అంబేడ్కర్ విగ్రహం సమీపంలో..

ఇందిరానగర్ కాలనీ చివరన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో కంబాలకొండ ప్రాంతాన్ని ఆనుకుని చేపడుతున్న ఓ నిర్మాణానికి వెళ్లడానికి కనీసం రహదారికి కూడా లేదు. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు పోవడంతో చకచకా నిర్మాణం సాగిపోతోంది. ఇక్కడ సుమారు 110 చదరపు గజాల స్థలంలో నాలుగు అంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నారు.

> **ప్లాన్ పెట్టుకుంటే అనుమతి ఇచ్చినట్లే..**
>
> భవన నిర్మాణదారులు ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకుంటే అనుమతి ఇస్తాం. ప్లాన్ పెట్టకపోతే నిర్మాణానికి అనుమతి ఉండదు. ప్లాన్ లేకుండా నిర్మిస్తే అది అనధికారిక నిర్మాణం అవుతుంది. ప్లాన్ పెట్టుకుంటే చిన్న రోడ్డు పక్కనైనా, ఎన్ని ఫ్లోర్లు అయినా నిర్మించుకోవచ్చు.
>
> – రాజు, ఇందిరానగర్ సచివాలయం టౌన్ ప్లానింగ్ సెక్రటరీ

శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభం


సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీ పాలెంలో శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు సీతారాముల కల్యాణ రాటను ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామస్తులు వేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రంపా రామ్మోహన్‌శర్మ దంపతులు, గ్రామ సేవా సంఘం పెద్దలు కల్యాణ రాటకు ప్రత్యేక పూజలు చేశారు. 9 రోజుల పాటు ఉత్సవ విగ్రహాలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 30న శ్రీరామనవమి వేడుకలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సమరయోధులకు కాగడాలతో నివాళి


తీరంలో కాగడాల ప్రదర్శనతో నివాళులర్పిస్తున్న పౌర ప్రజా సంఘాల సభ్యులు

బీచ్ రోడ్డు: స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా పౌర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శనతో నివాళులర్పించారు. బుధవారం ఆర్కేబీచ్ నుంచి కురుసుర సబ్‌మెరైన్ దగ్గర ఉన్న భగత్‌సింగ్ విగ్రహం వరకు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో గత నెలలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. గత నెల 28న హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సమీపంలో వేస్ట్ ఆయిల్ మండించే సమయంలో పైపు లీక్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో 104 ఏరియా ప్రాంతానికి చెందిన జి.రమణ(51) తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి ఆరిలోవలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమణ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. దీంతో రమణ కుటుంబానికి న్యాయం చేయాలని ఆస్పత్రి నిరసన చేపట్టారు. పరిహారంతో పాటు మృతుడి కుటుంబంలో ఒకరికి ఉపాధి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉగాది పురస్కారాల ప్రదానం


ఉగాది పురస్కారాలు అందుకున్న కవులు, ఇతర ప్రముఖులు

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురంలోని సీతారామ కల్యాణ మండపంలో పోర్ట్ సాంస్కృతిక సంస్థ సాగరి ఆధ్వర్యంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథి పోర్ట్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ ఆర్.ఎన్.హరికృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోర్ట్ రిటైర్డ్ హిందీ అధికారి పి.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పి.ఫ్రాన్సిస్ కవి సమ్మేళనాన్ని నిర్వహించగా.. ప్రముఖ కవి డాక్టర్ కేజీ వేణు సమీక్షించారు. ప్రముఖ వ్యాఖ్యాత పి.అభిషేక్‌ను ఉగాది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. జ్యోతిష్య శాస్త్రవేత్త, పంచాంగ కర్త అడబాల సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. 40 మంది కవులు, కవయిత్రులు కవితలను వినిపించారు. పోర్ట్ రిటైర్డ్ డిప్యూటీ సెక్రటరీ రాములు, సాగరి వైస్ ప్రెసిడెంట్ అవతారం నాయుడు, కార్యదర్శి ధర్మారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సామాన్యులకు నటనలో శిక్షణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ నాయుడు

సీతంపేట: సామాన్యులకు నటనలో శిక్షణ ఇవ్వాలనే సదుద్దేశంతో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించామని డైరెక్టర్ ఎస్.టి.నాయుడు తెలిపారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద షిర్డీసాయి స్కూల్ ఎదురుగా డాక్టర్ ఎస్.టి.నాయుడు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, డ్యాన్స్ అకాడమీలను బుధవారం ఆయన ప్రారంభించి, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నటనపై ఎంతోమందికి ఆసక్తి ఉన్నా ఆర్థిక స్తోమత లేక చాలా మంది వెనుకంజ వేస్తున్నారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని నగరంలో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ సంస్థలో యాక్టింగ్, స్క్రిప్ట్ రైటింగ్, యాంకరింగ్, డైరక్షన్, డ్యాన్స్‌ల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. మూడు నెలలు థియరీ, మరో మూడు నెలలు హైదరాబాద్‌లో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తామన్నారు. ప్రతిభ చూపిన నటీనటులతో సొంతంగా సినిమా నిర్మిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బీచ్ రోడ్డు: విమ్స్ ఆస్పత్రికి సంబంధించిన సబ్ స్టేషన్, కైలాసగిరి ఫీడర్ నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనుండడంతో గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలగనుందని జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, బీఎస్ఆర్ నగర్, తోటగరువు, హనుమంతవాక కొండ పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ఆలయాలకు ఉగాది శోభ


చినగదిలి షిరిడీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


శివాలయంలో స్వయంగా అభిషేకం చేస్తున్న భక్తులు


శివాజీపాలెంలో పూజలందుకున్న షిర్డీసాయి


పోలమాంబకు పూజలు చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి దంపతులు

ఆరిలోవ: ఆలయాలు శోభకృత్ ఉగాది శోభతో కళకళలాడాయి. తెలుగు వారి నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకుని ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. బుధవారం ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొత్త సంవత్సరంలో తమకు ఆయుఃఆరోగ్యాలు ప్రసాదించాలని భక్తులు భగవంతుడిని ప్రార్థించారు. ఆరిలోవ ప్రాంతంలో విఘ్నేశ్వర, షిర్డీ సాయిబాబా, రామాలయాలు, శివాలయాలు, అమ్మవారి గుడులు భక్తులతో సందడిగా మారాయి. ఇళ్లలో ఉగాది పచ్చడి రుచి చూసిన అనంతరం ఆలయాలకు వెళ్లి పూజలు, అభిషేకాలు చేశారు. చినగదిలిలో నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయం, దుర్గాబజార్‌లో రామాలయం, నెహ్రూనగర్, డ్రైవర్స్ కాలనీ, పెదగదిలి, విశాలాక్షినగర్‌లలో శివాలయాలు, భరత్ నగర్‌లో వెంకటేశ్వర ఆలయం, దుర్గాబజార్, బాలాజీనగర్, తోటగరువు, విజయదుర్గా కాలనీలలో దుర్గాదేవి గుడుల్లో భక్తులు పూజలు చేశారు.

ముగిసిన సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లో షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం బుధవారం ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవంలో భాగంగా ఆఖరి రోజు బాబాకు సామూహిక సత్యవ్రతాలు నిర్వహించారు. ఆదర్శనగర్‌తో పాటు రవీంద్రనగర్, డెయిరీఫారం, సుందర్‌నగర్, వివేకానందనగర్ ప్రాంతాల మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పరస నిర్వహించారు.

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాశీవిశ్వేశ్వర ఆలయం, అసంగానంద ఆశ్రమంలో శివలింగానికి భక్తులు అభిషేకాలు చేశారు. ఈస్ట్ షిర్డీ ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్యం, శివ, సాయి ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పోలమాంబ ఆలయంలో ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో డి.వి.ఎస్ సురేష్‌బాబా, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శంకరరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయంలో ఉగాది పంచాగ శ్రవణం, ఉగాది పురస్కారాల ప్రదానం నిర్వహించారు.

వెల్లివిరిసిన సంప్రదాయం

తెలుగువారి పండగైన ఉగాది రోజున ఆలయాలలో సంప్రదాయం వెల్లివిరిసింది. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ సంప్రదాయ వస్త్రధారణలో ఆలయాలకు విచ్చేశారు. సంప్రదాయ పంచెలు, చీర కట్టులో తెలుగుదనం ఉట్టిపడింది.

మద్దిలపాలెం: శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. శివాజీపాలెంలోని షిర్డీసాయి, వరసిద్ధి వినాయక, అభయ ఆంజనేయ స్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల అర్చకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మొక్కల పెంపకంతో నీటి నిల్వలు


మొక్క నాటుతున్న బులికృష్ణ

బీచ్ రోడ్డు: ఇంటర్నేషనల్ వాటర్ డే సందర్భంగా బుధవారం విశాఖ వ్యాలీ స్కూల్ సమీప బాలికల వసతి గృహంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి.బులికృష్ణ మొక్కలు నాటా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు భూమిలోని నీటి నిల్వల కోసం పెద్ద సంఖ్యలో మొక్కలను నాటాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ముత్యాల తలంబ్రాలు బహూకరణ


ఏఈవోకు ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్న దాత

సింహాచలం: వచ్చే నెల 2న సింహగిరిపై జరిగే వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన విజయలక్ష్మి డైమండ్స్ అధినేత శివశంకర్‌రాజు రూ.90వేలు విలువ చేసే ముత్యాల తలంబ్రాలు బహూకరించారు. సింహగిరిపై ఆలయంలో ఏఈవో నరసింహరాజుకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, రామలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


మృతుడు

సింహాచలం: పెందుర్తి రైల్వేస్టేషన్ సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద రైల్వే పట్టాలపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు విశాఖ జీఆర్‌పీ ఎస్ఐ బి.కామేశ్వరరావు తెలిపారు. సుమారు 75 ఏళ్ల ఉన్న వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో మృతిచెందినట్టు తెలిపారు. నీలం రంగు నిక్కర్, కనకాంబరం రంగు హాఫ్ హ్యాండ్ షర్టు ధరించి ఉన్న వ్యక్తి మొలతాడుకు బీరువా తాళం చెవి ఆకారం కలిగిన తాళాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 8985752107 నంబరులో సంప్రదించాలని కోరారు.

78 మంది యువకుల రక్తదానం

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్‌లో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతానికి చెందిన రేపాక సాయితేజ అనే యువకుడి తొలి వర్ధంతి సందర్భంగా అతడి కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. సుమారు 78 మంది యువకులు రక్తదానం చేశారు. ముందుగా సాయితేజ చిత్రపటానికి కార్పొరేటర్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఉగాది పంచాంగం పుస్తకావిష్కరణ


ఉగాది పంచాంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేణుమాధవ్, వరప్రసాద్, గోపి

బీచ్ రోడ్డు: విశాఖ నావెల్ డాక్‌యార్డ్ విశ్వకర్మ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పంచాంగం పుస్తకాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి కర్రి వేణుమాధవ్ ఆవిష్కరించారు. బుధవారం బీచ్ రోడ్డులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొమ్మోజు వరప్రసాద్, ఆల్ ఇండియా గోల్డ్ అప్రైజర్స్ అసోసియేషన్ నాయకుడు పెట్ల గోపి పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసి దళార్చన నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 రుసుం చెల్లించాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలని అధికారులు తెలిపారు.